ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి
ఆదివారం | 29 మార్చి , 2026 | పేజీలు : 06




యాదగిరిగుట్ట దేవస్థానం టెండర్ల అవకతవకలపై సిపిఐ ధ్వజం

# గ్యాస్ కొరతతో వినియోగదారుల ఇబ్బందులు

## 15 రోజులు గడిచినా సిలిండర్ అందని పరిస్థితి

## బ్లాక్ మార్కెట్‌లో దందాలు





**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** నల్లగొండ పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో గ్యాస్ కొరత తీవ్రంగా మారి వినియోగదారులను అయోమయంలోకి నెట్టేస్తోంది. గతంలో గ్యాస్ బుక్ చేస్తే 24 గంటల్లో ఇంటికి చేరే సిలిండర్లు, ప్రస్తుతం 15 రోజులు గడిచినా అందని పరిస్థితి నెలకొంది.దీంతో గృహిణులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పశ్చిమాసియా యుద్ధ ప్రభావంతో దేశానికి ఎల్పీజీ దిగుమతులు తగ్గిన నేపథ్యంలో ఈ పరిస్థితి ఏర్పడినట్లు తెలుస్తోంది. అయితే సరఫరా లోపంతో పాటు స్థానికంగా జరుగుతున్న అక్రమాలు కూడా కొరతకు కారణమవుతు న్నాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.ఆన్‌లైన్ బుకింగ్ వ్యవస్థ తరచూ మొరాయిస్తుండటంతో వినియోగదారులు ఏజెన్సీలను సంప్రదించాలంటే ఫోన్లు ఎత్తే వారు కూడా లేరని వాపోతున్నారు. ప్రత్యక్షంగా ఏజెన్సీల వద్దకు వెళ్లినా స్టాక్ లేదు అనే సమాధానమే వినిపిస్తోందని వినియోగదారులు చెబుతున్నారు.ఇక తెర వెనుక మరో దందా నడుస్తోందన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. గృహ అవసరాలకు అందాల్సిన డొమెస్టిక్ సిలిండర్లు అక్రమంగా హోటళ్లు, ఫంక్షన్ హాళ్లు, క్యాంటీన్లకు అధిక ధరలకు విక్రయిస్తున్నారని సమాచారం. అదేవిధంగా చిన్న సిలిండర్లలోకి రీఫిల్లింగ్ చేసి బ్లాక్ మార్కెట్‌లో రూ.400 నుంచి రూ.600 వరకు అధికంగా వసూలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు.ఈ పరిస్థితులతో అత్యవసరంగా గ్యాస్ అవసరమైన వినియోగదారులు తప్పనిసరి పరిస్థితుల్లో అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తోంది. మరోవైపు కమర్షియల్ గ్యాస్ సరఫరా కూడా దెబ్బతినడంతో హోటల్ రంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. చిన్న టిఫిన్ సెంటర్లు, వీధి వ్యాపారులు గ్యాస్ అందక కట్టెల పొయ్యిలకు మారాల్సిన పరిస్థితి ఏర్పడింది. గ్యాస్ కొరత ప్రభావంతో కట్టెల ధరలు కూడా విపరీతంగా పెరిగాయి. రెండు నెలల క్రితం రూ.600 ఉన్న కట్టెల క్వింటాల్ ధర ప్రస్తుతం రూ.1100కు చేరగా, తుమ్మ కట్టెలు రూ.800 నుంచి రూ.1400 వరకు పెరిగాయి. రవాణా ఖర్చులు అదనంగా భారం అవుతున్నాయని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలి: శ్రవణ్ కుమార్**



ఎల్పీజీ కొరతతో సామాన్య,మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.గ్యాస్ సిలిండర్ కోసం బుక్ చేసి 15 రోజులు గడిచినా అందక కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. గృహ వినియోగ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు మళ్లించడం ఆపి,సాధ్యమైనంత త్వరగా గ్యాస్ సరఫరాను సాధారణ స్థితికి తీసుకురావాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్ కుమార్ ప్రభుత్వాన్ని కోరారు.



## బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్సీ సత్యం

**ప్రజాపక్షం/మునుగోడు:** మండలంలోని పలివెల గ్రామానికి చెందిన సిపిఐ నాయకుడు గోస్కొండ దశరథ కుమారుడు గోస్కొండ పృథ్వి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే.ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం గ్రామానికి వెళ్లి పృథ్వి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.అలాగే,అదే గ్రామానికి చెందిన రాములు కూడా ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా,ఆయనను కలిసి ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు. ఎమ్మెల్సీ వెంట మాజీ ఎంపీపీ మాధగోని సాయిలు,సిపిఐ గ్రామ కార్యదర్శి ఆనగంటి నరసింహ,మహిళా సంఘం నాయకురాలు మాధగోని సత్తమ్మ,గోస్కొండ దశరథ ,కొండవీటి శ్రీనివాస్ రెడ్డి,అమృత రెడ్డి,గోస్కొండ మల్లేష్, కృష్ణయ్య, వెంకన్న,మాధగోని మల్లేష్ పాల్గొన్నారు.




## నాగార్జునసాగర్‌లో స్పిల్‌వే,గేట్లపై ప్రత్యేక తనిఖీలు

# 30న మున్సిపల్ బడ్జెట్ సమావేశం

## ప్రజా సమస్యలే అజెండగా...

## అస్త్రశస్త్రాలతో కౌన్సిల్ సభ్యులు సిద్ధం



**ప్రజాపక్షం/సూర్యాపేట :** సూర్యాపేట మున్సిపల్ 2026/27 ఆర్థిక సంవత్సర బడ్జెట్ సమావేశం ఈనెల 30వ తేదీన పట్టణంలోని రవి మహల్‌లో నిర్వహించేందుకు అధికారులు సన్నద్ధమయ్యారు. ఈమేరకు బడ్జెట్ కాపీలతోపాటు పరిపాలన ఆమోదానికి సంబంధించి ఏజెండా పత్రాలను ఆయా వార్డుల కౌన్సిలర్లకు అందజేశారు. నూతన పాలక వర్గం ఏర్పడిన తరువాత తొలిసారిగా జరిగే ఈ సమావేశంలో ప్రజా సమస్యలపై గళం విప్పేందుకు ఆయా వార్డులను ప్రాతినిధ్యం వహిస్తున్న అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్లు అస్త్రశస్త్రాలతో సిద్ధమవుతున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అధ్యక్షతన జరిగే ఈ సమావేశం ఉదయం 11 గంటల నుండి 12 గంటల వరకు బడ్జెట్ ఆమోదంపై చర్చ, 12 గంటల నుండి పరిపాలన ఆమోదానికి సంబంధించిన ఏజెండాపై సభ్యులు చర్చించి ఆమోదం తెలుపనున్నారు. 21 జనవరి 2025న గత పాలక వర్గ చివరి మున్సిపల్ సమావేశం జరగగా సభ్యుల పదవీకాలం ముగియడంతో ఫిబ్రవరి 2026 వరకు స్పెషల్ ఆఫీసర్ల పాలన కొనసాగింది. ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించగా నూతనంగా ఎన్నికైన పాలకవర్గం కొలువుదీరింది. ఎన్నికైన పాలకవర్గానికి ఇది తొలి సమావేశం. ఈనెల మొదటి వారంలోనే సమావేశాన్ని ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించగా అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో వాయిదా పడుతూ వచ్చింది. ఆర్థిక సంవత్సరం ముగుస్తుండడంతో అధికారులు సమావేశాన్ని నిర్వహించేందుకు చకచక అడుగులు వేశారు.

ప్రజా సమస్యలే ఎజెండగా మున్సిపల్ తొలి సమావేశానికి నూతనంగా ఎన్నికైన అధికార ప్రతిపక్ష కౌన్సిల్ సభ్యులు అస్త్రశస్త్రాలతో సిద్ధమవుతున్నారు. గత రెండున్నర ఏండ్లుగా సూర్యాపేట మున్సిపాలిటీలో జరిగిన అభివృద్ధి పనులంటూ ఏమి లేవు. స్థానికంగా అధికార పార్టీ నుండి శాసనసభ్యులు లేకపోవడంతో ప్రభుత్వం నిధుల కేటాయింపుల్లో వివక్ష చూపుతూ వస్తుందని ప్రజలు వాపోతున్నారు. మున్సిపాలిటిలో నూతన పాలక వర్గం ఏర్పడడం, అధికార కాంగ్రెస్ మున్సిపాలిటిపై జెండా ఎగురవేయడంతో ఇక అభివృద్ధి జరుగుతుందని పట్టణ ప్రజలు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారు. దీంతోనే సభ్యులు ప్రజా సమస్యల పరిష్కారమే ఏజెండాగా సమావేశంలో చర్చించనున్నారు. తాము ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై వారు గళం విప్పేందుకు తహతహలాడుతున్నారు. ప్రధానంగా మురుగు కాల్వలు, రోడ్ల నిర్మాణం, త్రాగునీటి సరఫరా, వీధిదీపాలు, పారిశుద్ధ్య సమస్య, దోమల నివారణ, వీధి కుక్కలు, కోతుల బెడదపై చర్చించే అవకాశాలు మెండుగా ఉన్నాయి. వీటికోసం ప్రత్యేకంగా నిధులు విడుదల చేయాలని పట్టుబడుతామని సభ్యులు బహిరంగంగానే చెబుతున్నారు. 11 మాసాలు మున్సిపాలిటిలో పాలకవర్గం లేకపోవడంతో అధికారులు ప్రజా సమస్యలను గాలికి వదిలి ఇష్టానుసారంగా విధులు నిర్వహిం చి అవినీతి, అక్రమాలకు పెద్దఎత్తున పాల్పడడంతో మున్సిపాలిటిలోని అవినీతి కంపును సమావేశంలో లేవనెత్తే అవకాశాలు లేకపోలేదు. వీటన్నింటిని బట్టి చూ స్తే తొలి సారి సమావేశం వాడివేడిగా జరిగే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.



## రథోత్సవ ఊరేగింపు

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** శ్రీరామ నవమిని పురస్కరించుకొని మండల కేంద్రంలోని శ్రీ సీతారాముల చంద్రమౌళీశ్వర, అయ్యప్ప స్వామి దేవాలయంలో గురు, శుక్ర, శనివారాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శనివారం పాత ఊరు ఆంజనేయ స్వామి దేవస్థానం నుండి రథంపై శ్రీ సీతారాముల వారిని పట్టణంలోని పురవీధుల గుండా వైభవంగా ఊరేగించారు. పట్టణ ప్రజలు ఎంతో ఉత్సాహంగా రథాన్ని తాడుతో లాగి భక్తి పారవశ్యం అయ్యారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిఐ నవీన్‌కుమార్, ఎస్ఐ అజ్మీరా రమేష్‌లు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## ఆధ్యాత్మిక చింతనతోనే ప్రశాంతత



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని శాసనసభ్యుడు బత్తుల లక్ష్మారెడ్డి సతీమణి మాధవి, తనయుడు సాయిప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. 3వ వార్డు తాళ్లగడ్డ ఆంజనేయస్వామి దేవాలయ ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరు భక్తి భావాలను అలవరుచుకోవాలని సూచించారు. అన్ని దానాల్లో కెల్లా అన్నదానం మహాదానం అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పద్మలక్ష్మి నారాయణ, బీసీ నాయకులు కోల సైదులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## స్వపరిపాలన భావన ప్రజాస్వామ్యానికి మూలస్తంభం




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** స్వపరిపాలన భావన ప్రజాస్వామ్యానికి మూల స్తంభమని ఎంఈవో ధర్మానాయక్ అన్నారు. షైనింగ్ స్టార్ విస్డం పాఠశాల విద్యార్థులు శనివారం స్వపరిపాలన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తన బాధ్యతలను గుర్తించి సమాజ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. పాఠశాల డైరెక్టర్ వినోద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పాత చట్టాన్ని కొనసాగించాలి

**ప్రజాపక్షం/అడ్డగూడూరు** : మోడీ ప్రభుత్వం వ్యవసాయ కార్మికుల, పేదల పోట్ట గోట్టడానికి తీసుకువచ్చిన విబి జి రామ్ జి చట్టాన్ని రద్దు చేసి, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బొల్లు యాదగిరి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల పరిధిలోని జానకిపురం గ్రామంలో ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కార్మికుల పని ప్రదేశాన్ని సందర్శించిన అనంతరం వారి సమస్యలను తెలుసుకుని నల్ల జెండాలతో నిరసన వ్యక్తం చేశారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో ఎర్లీ చైల్డ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలోని సీతారాపురం సెక్టార్ పరిధిలోని నందిపాడు అంగన్‌వాడి కేంద్రం2లో శనివారం ఎర్లీ చైల్డ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ సీహెచ్.పద్మ మాట్లాడుతూ అంగన్‌వాడి కేంద్రంలో 3 నుంచి 6 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు ప్రీస్కూల్ విద్యను ప్రైవేట్ విద్యా సంస్థలకు ధీటుగా అందిస్తున్నామని, పిల్లల మానసిక, శారీరక ఎదుగుదలకు ఉపయోగపడే విధంగా ఆటలు, పాటలు, కథల ద్వారా పిల్లలకు పాఠాలు బోధించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్ శేషుమణి, ఆయా కరుణ, ఆర్‌పీలు సరిత, ప్రసన్నలక్ష్మి, చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. అదేవిధంగా పట్టణంలోని ఇస్లాంపురం సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడి కేంద్రం3లో ఈసీసీఈడే కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్ పార్వతి చిన్నారులకు అన్నప్రాసన చేయించారు. అంగన్‌వాడి టీచర్లు ఎం.లలితమ్మ, బొందుపార్వతి, సీహెచ్.రాములమ్మ, రజిత, హెల్పర్లు ఆసియాబేగం, వి.లక్ష్మి, పార్వతమ్మ, కిశోర బాలికలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పర్యావరణ విద్యా కార్యక్రమం



**ప్రజాపక్షం/రామన్నపేట** : భారత ప్రభుత్వ అటవీ, పర్యావరణ మరియు వాతావరణ మార్పుల శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ జాతీయ హరిత దళం సహకారంతో నిర్వహిస్తున్న పర్యావరణ విద్య కార్యక్రమంలో భాగంగా రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో క్యాంపస్ ఎకో బజార్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య రాహత్ ఖానం మాట్లాడుతూ చదువుతో పాటు విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణ పట్ల అవగాహన కలిగించడం కోసం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. విద్యార్థులు స్వయంగా మట్టితో తయారుచేసిన బొమ్మలు, చిరుధాన్యాలతో, పండ్లు కూరగాయలతో చేసిన ఆహార పదార్థాలు, కాగితంతో తయారుచేసిన వివిధ కళాకృతులను ప్రదర్శించారు. అనంతరం ఇందులో ప్రతిభను ప్రదర్శించిన విద్యార్థులకు ప్రధానాచార్యులు ప్రశంసాపత్రములను ప్రదానం చేశారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.వెంకటేశ్వరరావు, ఐక్యుఎసి కోఆర్డినేటర్ డాక్టర్ లక్ష్మి నీలిమ, అధ్యాపకులు డాక్టర్ జి.సునీత, డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య, డాక్టర్ సిహెచ్. వెంకట్ గౌడ్, డాక్టర్ డి.కిషన్, డాక్టర్ ఎం.రవీందర్ రావు, డాక్టర్ రాచమళ్ళ శ్రీను, విద్యార్థులు పాల్గొన్నారు.

## బిసిసబ్ ప్లాన్‌కు చట్టబద్ధత కల్పించాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ప్రకారం ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే బీసీ సబ్ ప్లాన్ ఏర్పాటు చేస్తూ రాష్ట్ర అసెంబ్లీలో బిల్లు పెట్టి చట్టబద్ధత కల్పించాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ద్వారా తాము అధికారంలోకి రాగానే మహాత్మ జ్యోతిబాపూలే పేరుతో బీసీ సబ్ ప్లాన్ చట్టం చేస్తామని, ప్రతి ఆర్థిక సంవత్సరంలో బీసీల సంక్షేమానికి రూ.20వేల కోట్లు కేటాయించి ఐదు సంవత్సరాలకు గాను రూ.1లక్ష కోట్లు బీసీల అభివృద్ధికి ఖర్చు చేస్తామని హామి ఇచ్చారని కాని అమలుకు నోచుకోలేదని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం బీసీ సబ్‌ప్లాన్‌ను ఏర్పాటు చేసి బీసీలను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో బంటు వెంకటేశ్వర్లు, యర్రబెల్లి దుర్గయ్య, సత్యప్రకాశ్‌నాయుడు, దొనేటి శేఖర్, పజ్జూరి సైదులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ తిమ్మాపురంలో వెంకటేశ్వర స్వామి కల్యాణం



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్** : భువనగిరి మండలంలోని బిఎన్ తిమ్మాపురం గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో వెంకటేశ్వర స్వామి అమ్మవార్ల కళ్యాణం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పట్టు వస్త్రాలను మాజీ ఎంపిటిసి, బీసీ సంఘం మండల అధ్యక్షుడు జిన్నా మల్లేష్ దంపతులు కళ్యాణానికి సంబంధించిన పట్టు వస్త్రాలను, తలంబ్రాలు, పూలు ఆలయ పూజారులకు అందజేశారు. స్వామివారి కల్యాణము పూజలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు రామకృష్ణనంద స్వామి, మాజీ సర్పంచ్ రావుల నందు, వల్లందాస్ గండయ్య, నల్లమాస జంగిర్, జిన్న నర్సింహా, కృష్ణ స్వామి పాల్గొన్నారు.

## నెరవేరిన సొంతింటి కల



**ప్రజాపక్షం/రామన్నపేట** : ప్రజాప్రభుత్వం ప్రతిష్టాత్మంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లలో భాగంగా రామన్నపేట మండలం ఇంద్రపాలనగరం గ్రామానికి చెందిన కేస వెంకటేశం నూతన గృహప్రవేశం, సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు పూస బాలకిషన్ పాల్గొని స్వామి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కేస వెంకటేశం పేదల సొంతింటి కల నెరవేరిన్నందుకు ప్రజా ప్రభుత్వానికి మరియు నకిరేకల్ శాసన సభ్యులు వేముల వీరేశం మరియు జిల్లా నాయకులు పూస బాలకిషన్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.



## అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తువుల వితరణ

**ప్రజాపక్షం/చిట్యాలః** నల్లగొండ జిల్లా చిట్యాల మండలం ఏపూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలోని విద్యార్థుల అవసరాల కోసం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు చెందిన సిఎస్ఆర్ యాక్టివిటీస్‌లో భాగంగా బ్యాంకు అధికారులు పలు వస్తువులను శనివారం అందజేశారు. విద్యార్థులకు నిత్యం అవసరమయ్యే క్రీడా వస్తువులతో పాటు, ఎల్ఈడి టివి, రైస్ కుక్కర్, వాటర్ ఫిల్టర్, స్టీల్ ప్లేట్లు, గ్లాసులు, ఇతర పాత్రలు, నోట్ పుస్తకాలు, పెన్సిల్స్ ఇతర వస్తువులను అందజేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన మిత్ర హోల్ స్టిక్స్ హెల్త్ సొసైటీ చైర్మన్ లక్ష్మి రెడ్డి మాట్లాడుతూ తాము అందజేసిన వస్తువులు చిన్నారులకు ఉపయోగపడేలా చూడాలని టీచర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పాలెం మహేష్ గౌడ్, చౌటుప్పల్ మండలం పంతంగి ఎస్‌బిఐ మేనేజర్ క్రాంతి కుమార్, ఉపసర్పంచ్ సైదులు, వార్డు సభ్యులు సర్ర వెంకన్న, అంగన్‌వాడీ టీచర్లు డి ధనలక్ష్మి, అంశమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మజ్జిగ ప్యాకెట్లు అందజేత



**ప్రజాపక్షం/చిట్యాలః** నల్లగొండ జిల్లా చిట్యాల మండల కేంద్రంలో శనివారం పది పరీక్షలు వ్రాసిన విద్యార్థులకు ఆసరా స్వచ్ఛంద సేవా సంస్థ వారు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. పంపిణీ కార్యక్రమాన్ని మండల విద్యాధికారి సైదానాయక్ ప్రారంభించి మాట్లాడుతూ యువతరం సామాజిక సేవలను అందించేందుకు ముందుకు రావాలని, ప్రతి ఒక్కరు సేవా గుణాన్ని అలవర్చుకోవాలని సూచించారు. విద్యార్థుల కోసం చక్కని కార్యక్రమాలను చేపడుతున్న సంస్థ వ్యవస్థాపకి అధ్యక్షులు మేడి హరికృష్ణను ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు గడగోజు ఎల్లాచారి, మేకం శేఖర్, నర్రా భిక్షంరెడ్డి, వల్లకీర్తి మధు, సిరిపంగి ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్య వైపు చూపాలి




**ప్రజాపక్షం/రామన్నపేట** : రామన్నపేట మండల కేంద్రంలోని శ్రీ హిందూ డిగ్రీ కళాశాల నందు యాంటీ డ్రగ్స్ పై రామన్నపేట ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సెమినార్‌లో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పనకంటి భాస్కర్ రావు మాట్లాడుతూ విద్య చాలా గొప్పదని, ఈ ప్రపంచాన్ని కేవలం విద్య ద్వారా మాత్రమే సాధించవచ్చు అని యువత ప్రధానంగా నేడు పరిస్థితుల్లో విద్యకు మాత్రమే ప్రాధాన్యత ఇవ్వాలని ధూమపానం, మద్యపానానికి దూరంగా ఉండాలన్నారు. అనంతరం ఎక్సైజ్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బండారు శ్రీదేవి, ఎక్సైజ్ సీఐ ఆర్.బాలాజీ నాయక్, ఎస్సై బి.శివకృష్ణ, ఎన్.శంకర్, అనిల్, కృష్ణ, వెంకటేష్, సోని కళాశాల అధ్యాపకులు వెంకటరమణారెడ్డి, లింగస్వామి కళ్యాణి వెన్నెల సునీల్, పాల్గొన్నారు.

## నరసింహ మృతి బాధాకరం

**ప్రజాపక్షం/రామన్నపేట** : రామన్నపేట మండలం పల్లివాడ గ్రామంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో సిపిఎం పార్టీ నాయకులు బైకానీ నరసింహ మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న గ్రామ సర్పంచ్ కంభంపాటి శ్రీనివాసులు గౌడ్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించి నరసింహ సిపిఎం పార్టీకి చేసిన సేవలను గుర్తుకు చేశారు. అనంతరం నరసింహ కుటుంబానికి టిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తల సహకారంతో రూ.37 వేల ఆర్థిక సహాయం కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కంభంపాటి శ్రీనివాసులు గౌడ్, నాంపల్లి లింగయ్య, మాజీ ఉపసర్పంచ్ దండిగ నాగరాజు పాల్గొన్నారు.



## వేసవిలో దివ్య ఔషధం తాటి కల్లు

**ప్రజాపక్షం/చందంపేట;** వేసవిలో దివ్య ఔషధంగా ప్రజలు తాటికల్లును భావిస్తారు. నల్గొండ జిల్లా చందం పేట మండలం చిత్రయాల గ్రామంలో వనంలా తాటి చెట్లు ఉండడంతో వేసవి వచ్చిందంటే ప్రజలు ఔషద గుణాలు కలిగి ఉన్న ప్రకృతి ప్రసాదించిన కల్లును సేవించేందుకు గ్రామంలోని వారే కాకుండా చుట్టూ పక్కల గ్రామాల నుండి తాటి వనంలోకి బారులు తీరుతూ ప్రజలు వస్తూ చెట్టు నుండి దింపిన కల్లును ఆస్వాదిస్తారు. వేసవి కాలం వచ్చిందంటే తాటికల్లుకు మస్తూ గిరాకీ ఉంటుందని గౌడన్నలు చెబుతున్నారు. చిత్రియాల గ్రామంలో స్వచ్ఛమైన కల్లు దొరుకుందనే ప్రచారంతో ఉదయం మరియు సాయంత్రం అవ్వగానే చెట్ల వద్దకు ప్రజలు బారులు తీరుతారు.

## ముత్యాలమ్మ తల్లి అనుగ్రహం పొందాలి



**ప్రజాపక్షం/దేవరకొండ;** ప్రతి ఒక్కరు మాల్‌గడ్డ ముత్యాలమ్మ తల్లితఅనుగ్రహం పొందాలని బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ మాజీ ఎంఎల్ఏ రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. శని వారం మండలంలోని మాల్‌గడ్డ ముత్యాలమ్మ తల్లిని ఆయన దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు టివిఎన్‌రెడ్డి, కృష్ణ, అంజి, అంజయ్య, నాయకులు తది తరులు పాల్గొన్నారు.

## అన్ని హంగులతో నూతన ఫంక్షన్ హాల్

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** అన్ని హంగులతో శ్రీవెంకటేశ్వర ఏసి కన్వెన్షన్ హాల్ ఏర్పాటు చేయడం అభినందనీయమని మున్నూరుకాపు జిల్లా అధ్యక్షులు ఎలిమినేటి రమేష్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రం లోని ఎస్వి కాలేజ్ గ్రౌండ్ ఆవరణలో మానేపల్లి లక్ష్మయ్య (పరిటాల రవి) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన ఫంక్షన్ హాల్‌ను ప్రారంభించి మాట్లా డారు. వివాహాలకు అవసరమైన డిజైన్‌తో, సకల సౌక ర్యాలతో ఫంక్షన్ హాల్ నిర్మించడంతో పాటు అన్ని రకాల ఫంక్షన్‌లు నిర్వహించుకునేందుకు ఉంద న్నారు. ఈ కార్యక్రమంలో మున్నూరుకాపు పట్టణ అధ్యక్షులు దేగల రమేష్, మదంశెట్టి ఉపేందర్, మదం శెట్టి నాగేశ్వరరావు, మదంశెట్టి వీరయ్య, నిర్వాహ కులు మానేపల్లి లక్ష్మయ్య, సాయి పాల్గొన్నారు.




## ఖనిజ సంపదతో మూడు ట్రిలియన్‌ల ఆర్థిక వ్యవస్థ సాధ్యమే



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** తెలంగాణ రాష్ట్రంలోని ఖనిజ సంపదతో మూడు ట్రిలియన్‌ల ఆర్థిక వ్యవస్థ సాధ్యమేనని మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం భూవిజ్ఞానశాస్త్ర విభాగం సహాయ ఆచార్యులు డాక్టర్ ఏం.ఆంజనేయులు అన్నారు.శనివారం నాగార్జున ప్రభుత్వ కళాశాల భూ విజ్ఞాన శాస్త్రం జియాలజీ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు విస్తృతోపా న్యాసం జరిగింది.ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ భూవిజ్ఞానశాస్త్రం జియాలజి విభాగం ద్వారా తెలంగాణలో ఖనిజ సంప ద పైన పరిశో ధన,వినియోగం ద్వారా రాష్ట్రంలో విద్యార్థు లకు,యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతా యని,ఖనిజ సంపద తో తెలంగాణ లో మూడు ట్రిలి యన్ ల ఆర్థిక వ్యవస్థ సాధ్యమేనని అన్నారు.జియా లజీ కోర్సును చదవడం వలన మునుముందు జీవి తంలో పొందే ఉద్యోగ అవకాశాలను గూర్చి అవగా హన కల్పించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫసర్ అంతటి శ్రీనివాసులు మాట్లాడుతూ తెలంగాణ ఖనిజ వనరుల గూర్చి వాటి అన్వేషణలో జియాలజీ విద్యా ర్థులు పోషించాల్సిన ముఖ్యపాత్రను గూర్చి వివరిం చారు.ఈకార్యక్రమంలో కళాశాల జియాలజి శాఖ అధిపతి ఇంద్రకంటి చంద్రయ్య,జియాలజీ లెక్చరర్ కే. దుర్గాప్రసాద్,జియాలజీ విద్యార్థిని,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## హజ్ యాత్రికులు టీకా తప్పనిసరి తీసుకోవాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** హజ్ యాత్రకు వెళ్ళే ప్రతి యాత్రికుడు తప్పనిసరిగా ప్రభుత్వం సూచించిన టీకాలను తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పెండెం వెంకట రమణ అన్నారు. శనివారం తెలంగాణ ప్రభుత్వ ఆదేశాలతో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుప్రతిలో ప్రత్యేక కౌంటర్ల ద్వారా టీకా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. వాజ్ యాత్రికులు విదేశీ ప్రయాణం చేసే సందర్భంలో వాతావరణ మార్పులు, జనసమ్మర్థం, భిన్నమైన ఆహారపు అలవాట్ల వలన వ్యాధులు సోకే అవకాశాలు ఎక్కువగా ఉంటాయ న్నారు. ముందస్తు జాగ్రత్తగా ప్రభుత్వం సూచించిన టీకాలైన మెనింజిటిస్ టీకా, ఇన్‌ఫ్లుయెంజా, పోలియో టీకాలను వేయించుకోవాలని కోరారు. యాత్రికులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు తాగునీరు, ఆహారంపై జాగ్రత్తలు తీసుకోవాల న్నారు. 40 మంది యాత్రికులకు టీకాలు వేసినట్లు తెలిపారు. హజ్ కమిటి సభ్యులు సిద్దిక్, ఇమ్రాన్‌లు పాల్గొని టీకాలు నిర్వహించడం పట్ల కృతజ్ఞతలు తెలి పారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ కోటిరత్నం, డాక్టర్ వాసవి, డాక్టర్ సనత్, విసిసియం లతీఫ్, డివియల్‌యం నవ కాంత్, ఆరోగ్య సిబ్బంది జానీబేగం, వజీర్‌భాను, నసీమా, నేహా పాల్గొన్నారు.

## వైభవోపేతంగా శ్రీరాముని పట్టాభిషేకం



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** జిల్లా కేంద్రం లోని శ్రీవేదాంత భజన మందిరంలో శనివారం వైభ వోపేతంగా శ్రీసీతారామచంద్ర స్వామి మహాపట్టాభి షేకం నిర్వహించారు. రాజాధి రాజుగా స్వామివారు దర్శనమిచ్చారు. మహాపట్టాభిషేకం చూసేందుకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. భక్తులు స్వామి వారి పట్టాభిషేక మహోత్సవాన్ని చూసి పులకించిపో యారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్ర మాన్ని ఏర్పాటు చేశారు. సాయంత్రం సీత, రామ, లక్ష్మణ, ఆంజనేయ స్వామి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి వాహనంలో సూర్యాపేట పట్టణంలోని పురవీధుల గుండా శోభాయాత్ర నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ప్రధాన అర్చకులు ధరూరి సింగరాచార్యులు, శ్రీవేదాంత భజన మందిరం అధ్యక్షులు రాచర్ల వెంకటేశ్వర రావు, నకరికంటి రాజశేఖర్, సోమ అశోక్, మాజీ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఉప్పల లలిత ఆనంద్, సోమ సుమన్, రాఘవాచార్యులు పాల్గొన్నారు.

## రాజీమార్గమే రాజమార్గం



**ప్రజాపక్షం/రామన్నపేట :** రామన్నపేట కోర్టు పరి ధిలో మొత్తం 546 కేసులకు పరిష్కారం లభించింది. శనివారం రామన్నపేట సీనియర్ సివిల్ జడ్జ్ జి.సబిత, సెకెండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు జడ్జి డి.సత్త య్యలు కలిసి కోర్టు హల్‌లో జాతీయ లోక్ అధాల త్‌ను నిర్వహించారు. రామన్నపేట జ్యుడిషియల్ సంబంధించి రామన్నపేట, వలిగొండ, మోత్కూరు, అడ్డగుడూరు స్టేషన్ పరిధిలో సివిల్, క్రిమినల్, బ్యాంకు, ప్రీ లిటిగేషన్, ఇతర ప్రీ లిటిగేషన్, పిట్టి కేసులు పరిష్కరించుకున్నారు. బ్యాంక్ కేసులు, ప్రీ లిటిగేషన్ కేసుల ద్వారా రూ.5,18,350 డబ్బు రిక వరీ చేయబడినట్లు తెలిపారు. అనంతరం జడ్జీ మాట్లా డుతూ క్షణికావేశాలతో అప్పటి పరిస్థితులలో కేసులు పెట్టుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ డబ్బులు, సమయం వృధా చేసుకోవడం బదులు రాజీమార్గమే రాజమార్గంగా కోర్టు పరిధిలో నిర్వహించే లోక్ అధా లత్ వినియోగించుకొని సమస్యలు పరిష్కరించుకోవ డానికి కక్షిదారులు ముందుకు రావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్‌లు, పలు మండలాల ఎస్బిఐ బ్యాంక్ మేనేజర్లు, వివిధ పోలీస్ స్టేషన్‌ల సిబ్బంది, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## నీటిని నిల్వ చేసుకొని భూగర్భ జలాలను కాపాడుకోవాలి

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహణ సీడ్ స్వచ్ఛంద సంస్థ నిర్వహణలో, జిల్లా భూగర్భ జల శాఖ యాదాద్రి భువనగిరి సహకారంతో నీరు మరియు లింగ సమానత్వం థీమ్తో 36వ ప్రపంచ జల దినోత్సవం పురస్కరించుకొని శనివారం రైతు వేదికలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులగా ఆర్‌డిఓ శేఖర్ రెడ్డి మాట్లాడుతూ విఘవిషరిస్తున్నా పట్టణీకరణ, ఎక్కువ నీటీ అవసరాలు ఉండటం వర్షపు నీరు భూగర్భ జలాలు ఇంకించకపో వడం అధికంగా నీటి వినియోగం వల్ల నీటి కొరత సమస్య మరింత తీవ్రమవుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల రెవిన్యూ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా ఫిషరీస్ అధికారి, మిషన్ భగీ రత అధికారి, ఉద్యయన శాఖ అధికారి మాధవి, సీడ్ స్వచ్ఛంద సంస్థ సిఈఓ ఎస్.నాగబ్రహ్మ చారి రైతులు మహిళలు పాల్గొన్నారు.

## విద్యార్థులు జీవితంలో ఉన్నతంగా ఎదగాలి



**ప్రజాపక్షం/దేవరకొండ;** విద్యార్థులు కష్టపడి చవివి జీవితంలో స్థిరపడి చదివిన కళాశాలకు, అధ్యాపకులకు, తల్లిదండ్రులకు మంచి పేరును తీసుకురావాలని టిపిసిసి సభ్యులు జాలే నర్సింహా రెడ్డి విద్యార్థులకు సూచించారు. శనివారం పట్టణంలోని ఎంకేఆర్ డిగ్రి కళాశాలలో జరిగిన సినియర్ విద్యార్థుల వీడ్కోల్ సమావేశా నికి ముఖ్య అతిథిగా నర్సింహారెడ్డి హాజరై విద్యార్థులకు శుభాకాం క్షలు తెలిపారు. వీడ్కోలు సమావేశం అనేది కళాశాల జీవితంలో తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సినియర్లకు, జూనియర్లు, అధ్యాపకులు వీడ్కోలు పలికే ఒక చిరస్మరణీయ వేడుక అని అన్నారు. ఈకార్యక్రమంలో ఎంకేఆర్ కళాశాల ప్రిన్సిపల్ రవినా యక్, అధ్యాపకులు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మసాన్‌పల్లిలో విషాద ఛాయలు

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం మసాన్‌పల్లి గ్రామానికి చెందిన బత్తిని మహేష్‌గౌడ్(24) మరణంతో గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి. గత నాలుగు రోజుక్రితం బైక్ ప్రమాదంలో తలకు బలమైన గాయం కావడంతో హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చికిత్స అంది స్తున్న తరుణంలో బ్రెయిన్ డెడ్ కావడంతో శనివారం మహేష్ చికిత్స పొందుతూ మరణించడం జరిగిందని వైద్యులు తెలిపారు. దింతో జీవన్ దాన్ సంస్థ వారు మహేష్ తల్లిదండ్రులను అవయవ దానానికి ఒప్పించడంతో మహేష్ అవయవాలను 8 మందికి దానం చేయడం జరిగిందని మహేష్ తల్లిదండ్రులు తెలిపారు. మహేష్ మరణంలో మసాన్‌పల్లి గ్రామంలో విషాద చాయలు అలు ముకొని తల్లిదండ్రులు, బంధువులు, గ్రామస్తులు కన్నీరు మున్నీ రుగా విలపించారు.

## భక్తిశ్రద్ధలతో గీతా యజ్ఞం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** శ్రీరామనవమి నిర్వహించిన సంద ర్భంగా అనంతరం ఆనవాయితీగా వస్తున్న గీతా యజ్ఞాన్ని శని వారం నల్లగొండ పట్టణంలోని బీట్ మార్కెట్లోని శ్రీ వాసవి మాత శ్రీ ఉమామహేశ్వర స్వామి సహిత శ్రీరామ కోటి స్థూప దేవాల యంలో భక్తి శ్రద్ధలతో వేదమంత్రోచరణాల నడుమ శాస్త్రప్తంగా గీతా యజ్ఞం నిర్వహించారు,ఈసందర్భంగా మహిళా భక్తుల శ్రీరా మనమ పారాయణం మధ్యన యజ్ఞాన్ని వేదమూర్తులు నిర్వహిం చారు. అనంతరం శ్రీ రామ కోటి పుస్తక పూజ నిక్షిప్తం కార్యక్ర మాన్ని ఘనంగా నిర్వహించి,అనంతరం అన్నదాన వితరణ చేశారు.ఆలయ కమిటీ చైర్మన్ ఓరుగంట పరమేష్ ఆధ్వర్యంలో ఆలయ కమిటీ ధర్మకర్తలు గజ్జల వెంకటేశ్వర్లు కుక్కడపు శ్రీనివాసు ప్రోగ్రాం కన్వీనర్ మేడం విశ్వ ప్రసాద్ నిర్వహణలో జరిగింది.ఈ కార్యక్రమంలో రేపాల భద్రాద్రి,మిట్టపల్లి గోవర్ధన్ గుండా రమేష్ బాబు,శివకోటి నెహ్రూ కర్నాటి నగేష్, వాత్సవ్,మురారి శెట్టి శంకర్,బండారు సురేష్,వనం గోపికృష్ణ పాల్గొన్నారు.



## టీకాలు వేయించాలి

**ప్రజాపక్షం/గుండాల;** ప్రతి రైతు తమ పశువులకు ప్రభుత్వం అందిస్తున్న గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేయించాలని కొమ్మాయిపల్లి సర్పంచ్ తాంద్ర నారాయణస్వామి రైతులకు సూచించారు. శనివారం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మండల పశు వైద్యాధికారి డా. యాకుబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టీకాల కార్యక్రమాన్ని సర్పంచ్ ప్రారంభించి మాట్లాడారు. అనంతరం సుమారు 106పశువులకు టీకాలను వేయడం జరిగింది. ఈకార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డా. యాకుబ్, ఉప సర్పంచ్ దాసగాని కొమురయ్య, గోపాలమిత్రలు కృష్ణ, నరేష్, శ్రీను, శేఖర్, రైతులు పాల్గొన్నారు.

## బిల్డింగ్ ఆదర్ కన్ఫ్యూషన్ వర్కర్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** బిల్డింగ్ ఆదర్ కన్ఫ్యూషన్ వర్కర్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షులు జంజనం కోటేశ్వరరావు అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆయన కార్మికుల సమావేశంలో మాట్లాడుతూ చమటోడ్జి కష్టించే కార్మికుల హక్కుల పరిరక్షణ వారి సమస్యల పరిష్కారం కోసం ఈనెల 30న మండల కేంద్రాల్లో జరిగే ధర్నాలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. శ్రమను నమ్ముకుని శ్రామికుల ఆరోగ్యం గాలిలో కలిసిపోతున్నా ఏ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు.ఈ కార్యక్రమంలో కార్మికులు హుస్సేన్, ప్రమీల, శాంతి, వీరమ్మ, చిన్ని, ఊర్మిళ, సాలమ్మ పాల్గొన్నారు.

## నిరుపేదలకు అండగా...




**ప్రజాపక్షం/కోదాడ రూరల్ :** మండలంలోని గుడిబండ గ్రామంలో సామాజిక సేవా దృక్పదంతో యరగాని నాగశేషు గౌడ్ మానవత్వాన్ని చాటుకున్నారు. శనివారం గ్రామానికి చెందిన ఎండి ముస్తఫా కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న ఆయన వారికి చేదోడువాదోడుగా ఉండాలనే ఉద్ధేశంతో 25 కేజీల బియ్యాన్ని విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ కష్టాల్లో ఉన్న వారికి తనవంతు సహాయం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని ఆయనను అభినందించారు. సహాయం చేసే గుణం అందరికి ఉండదని, ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెందరికో స్ఫూర్తిస్తానియన్నారు.

## చికిత్స పొందుతూ మహిళ మృతి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మండలంలోని కిష్టాపురం గ్రామంలో రోడ్డు దాటుతుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతిచెందింది. మిర్యాలగూడ రూరల్ పోలీసులు తెలిసిన వివరాల ప్రకారం కిష్టాపురం గ్రామంలో బెజవాడ చంద్రమ్మ(60), ఆమె మనవరాలు చందన(10) రోడ్డు దాటుతుండగా వాడపల్లి వైపు నుంచి మిర్యాలగూడ వైపుకు వస్తున్న మోటార్ సైకిల్ వాహనం ఢీకొట్టింది. ఈ సంఘటన ఈనెల 26న సాయంత్రం చోటు చేసుకోగా చికిత్స పొందుతూ శనివారం మృతిచెందింది. కేసు నమోదు చేసుకోని విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## లారీ యజమానుల ధర్నా



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** వాణిజ్య వాహనాల ఫిట్నెస్ సర్టిఫికెట్ కోసం అవసరమైన రేడియం రిఫ్లెక్టర్ స్టిక్కర్లపై డీలర్లు నిర్ణయించిన అధిక ధరలు పరిమిత సరఫరా వ్యవస్థపై సమీక్ష చేయాలని కోరుతూ ది మిర్యాలగూడ లారీ ఓనర్స్ అస్సోయేషన్ అధ్యక్షుడు సింగాపురం మల్లారెడ్డి అన్నారు. ఈ మేరకు శనివారం స్థానిక ఎంవీఐ కార్యాలయం వద్ద అసోసియేషన్ సభ్యులు ధర్నా చేసి కార్యాలయంలో వినతి పత్రం అందించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేడియం రిఫ్లెక్టర్ల కొనుగోలు విషయంలో అమలు చేస్తున్న ప్రస్తుత విధానం వల్ల చిన్న, మధ్య తరహా వాహన యజమానులపై తీవ్రమైన ఆర్థిక భారం పడుతుందన్నారు. ప్రస్తుతం ఫిట్నెస్ సర్టిఫికెట్ పొందడానికి రవాణాశాఖ నియమించిన డీలర్ల ద్వారా మాత్రమే రేడియం స్టిక్కర్లు కొనుగోలు చేయాల్సి ఉండగా డీలర్లు నిర్ణయించిన ధరలు ఓపెన్ మార్కెట్ ధరలతో పోలిస్తే దాదాపు రెండు రెట్లు ధరలు ఎక్కువగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మర్రి సురేష్‌రెడ్డి, కోశాధికారి ఆత్మూరి నవీన్‌కుమార్, అనంతుల నాగరాజు, రాంభద్రారెడ్డి, నాగరాజు, శ్రీను, నగేష్, గోవర్ధన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, వెంకటయ్య, మల్లేశం, జానయ్య, వెంకన్న, భాస్కర్ రెడ్డి, ఇక్బాల్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ రహిత సమాజాన్ని నిర్మిద్దాం




**ప్రజాపక్షం/కోదాడ:** మానవులంతా ప్రకృతికి దగ్గరగా జీవించాలని, ప్రతి ఒక్కరు మొక్కలు పెంచాలని, నీటిని వృధా చేయవద్దని భావితరాలకు కాలుష్యంలేని సమాజాన్ని అందించాల్సన బాధ్యత ప్రతి ఒక్కరి మీద ఉందని పర్యావరణవేత్త దుశ్చర్ల సత్యనారాయణ అన్నారు. శనివారం కోదాడలోని కెఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో ఎకోక్లబ్ ఆధ్వర్యంలో ఆర్గానిక్ ఫుడ్ పెస్టివల్ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల విద్యార్థులు సృజనాత్మక ఆలోచనలతో పర్యావరణ రహిత వస్తువులను, ఆహార పదార్దాలను ప్రదర్శించారు. గాలిని నీటిని నిప్పును ఆడవులను రక్షించాలని విద్యార్థులు వివిధ పర్యావరణ రహిత ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హదసరాణి, ఇండియన్ అర్మిఫోర్స్ అధికారి శ్రీరామ్, ఉస్మానియ యూనివర్శిటి పిహెచ్‌డి పరిశోధకుడు గోపాల్, ప్రముఖ సాహితివేత్త కృష్ణమూర్తి, ఎకో క్లబ్ కన్వీనర్ చందా అప్పారావు, అధ్యాపకులు సైదిరెడ్డి, నాగిరెడ్డి, నిర్మలకుమారి, ప్రాన్సిస్, సైదులు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## జీవో నెంబర్ 60పై కోదాడలో లారీ ఓనర్ల ఆందోళన



**ప్రజాపక్షం/కోదాడ:** తెలంగాణ రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన జీవో నెంబర్ 60 ప్రకారం రేడియం స్టిక్కర్లు తప్పని సరి చేయడం, వాటి అమలులో అధిక ఛార్జీలు వసూలు చేస్తున్నారని ఆరోపిస్తూ కోదాడ లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ కార్యాలయం వద్ద లారీ యాజమానులు రాస్తారోకో నిర్వహించి అర్ధనగ్న ప్రదర్శనతో తమ అగ్రహన్ని వ్యక్తం చేశారు. ఖమ్మం రహదారిపై కొంతసేపు ట్రాపిక్‌కు అంతరాయం కలిగింది. ఈ సందర్భంగా లారీ యాజమానులు మాట్లాడుతూ సుమారు వేయి రూపాయల ఖర్చుతో పూర్తయ్యే రేడియం స్టిక్కర్లను ప్రైవేట్ కంపెనీల ద్వారా 6వేల నుండి8వేల వరకు వసూలు చేయడం అన్యాయమని తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వం ఈ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నిరసన అనంతరం రేడియం స్టిక్కర్లు అమలు చేస్తున్నన ఆన్‌లైన్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సిలను తొలగించారు. పోలీసులు అక్కడకు చేరుకుని ధర్నాను శాంతింపజేశారు. లారీ యాజమానులు పాల్గొన్నారు.

## గ్రామీణ అభివృద్ధి ప్రణాళికలు నిధుల వినియోగంపై అవగాహన




**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** తెలంగాణ రాష్ట్రలోనీ ప్రతి గ్రామం సమగ్ర అభివృద్ధి సాధించాలంటే పంచాయతీ రాజ్ చట్టం, గ్రామాభివృద్ధి ప్రణాళికలు, నిధుల వినియోగంపై ప్రతి అధికారి పూర్తి అవగాహన కలిగి ఉండాలని స్పష్టం చేశారు.మండల పరిషత్ కార్యాలయంలో గత వారం రోజులుగా నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యుల కోసం నిర్వహించిన మొదటి బ్యాచ్ శిక్షణా కార్యక్రమం శనివారం ముగిసినట్లు ఆయన తెలిపారు.ముగింపు వేడుకలో ఆయనతోపాటు మండల పంచాయతీ అధికారి ఎం.డి.మజీద్, సూపరింటెండెంట్ ఎ.సత్యనారాయణ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. శిక్షణ పూర్తి చేసుకున్న 11 గ్రామ పంచాయతీల వార్డు సభ్యులకు వారు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. శిక్షణ పూర్తి చేసుకున్న 11 గ్రామ పంచాయతీలు, ఈ మొదటి విడతలో 1.అంతమ్మగూడెం, 2.భీమన్పల్లి, 3.దంతూర్, 4.దేశ్ముఖ్, 5.దోతిగూడెం, 6.గౌసెకొండ, 7.ఇంద్రియాల, 8.జగత్పల్లి, 9.జలాల్పూర్, 10.జిబ్లక్పల్లి, 11.కనుముక్కుల గ్రామాలకు చెందిన వార్డు సభ్యులు శిక్షణ పొందినట్లు వివరాలు తెలిపారు. వారం రోజుల పాటు జరిగిన ఈ శిక్షణలో శిక్షకులు టిఓటిఎస్ అందించిన సూచనలను పాటిస్తూ వార్డు సభ్యులు తమ గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలని కోరారు. ఈ కార్యక్రమంలో శిక్షకులు వార్డు సభ్యులకు వివిధ అంశాలపై లోతైన అవగాహన కల్పించారు. రెండో బ్యాచ్ శిక్షణ వివరాలు, మండలంలోని మిగిలిన 10 గ్రామ పంచాయతీల వార్డు సభ్యులకు రెండో బ్యాచ్ శిక్షణ సోమవారం నుండి ప్రారంభం కానుందని అధికారులు వెల్లడించారు. సంబంధిత పంచాయతీల వార్డు సభ్యులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



## మానవత్వాన్ని చూపిన అభినవ యూత్

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** పోచంపల్లి మున్సిపాలిటీలోని పద్మనగర్ రైస్ మిల్లులో కూలి పని చేస్తూ జీవనం సాగిస్తున్న కూలి మణికంఠ తండ్రి ఇటీవల రోడ్డు ప్రమాదంలో కాలు విరిగి సంవత్సరం పాటు మంచానికకే పరిమితం కావాలని డాక్టర్లు సూచించిన సూచించడంతో కుటుంబ పోషణ దయనీయ పరిస్థితిని చూసి పోచంపల్లి పట్టణానికి చెందిన అభినవ యూత్ బాధిత కుటుంబ సభ్యులనో ఆదుకోవడం కోసం మానవత్వాన్ని చూపుతున్నారు. శనివారం కుటుంబాన్ని పరామర్శించి 3 నెలలకు సరిపడా 75 కిగ్రా బియ్యము, నిత్యావసర సరుకులు, మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి వేముల నరేష్, కోశాధికారి వల్లాల బాలరాజు, క్రీడాల కార్యదర్శి బిజ్జ బాలకృష్ణ, దయాకర్, కాలనీ వాసులు రచ్చ కరుణాకర్, ఆడెపు రాజశేఖర్, కుసుమ సాయి, ఆడెపు భావనందు పాల్గొన్నారు.

## తాజ్‌పూర్‌లో రైతు సదస్సు, వ్యవసాయ ప్రదర్శన కార్యక్రమం



**ప్రజాపక్షం/భువనగిరి :** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం తాజ్ పూర్ గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం యాదాద్రి భువనగిరి ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాలకు చెందిన గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమ విద్యార్థులు (RAWEP 202526) రైతు సదస్సు మరియు వ్యవసాయ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా డా.ఎం.గోవర్ధన్ (రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల అస్సోసియట్ డీన్) మాట్లాడుతూ ముందుగా తాజ్ పూర్ గ్రామ సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్ ఆధ్వర్యంలో తమ కళాశాల విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని చేపట్టడం సంశోషకరం అన్నారు. .ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్, డా.డి.శ్రీలత (యాదాద్రి భువనగిరి జిల్లాలో టిఆర్‌వికెకు ప్రధాన శాస్త్రవేత్త), శ్రీనివాస్, మండల రైతులు కంచి మల్లయ్య, ఉప సర్పంచ్ వరిగంటి కృష్ణ, వార్డు సభ్యులు పల్లెపాటి కృష్ణ, ఎస్కే గాలిబి యాకుబ్ పాల్గొన్నారు.

## శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ పునర్నిర్మాణం

**ప్రజాపక్షం/డిండి;** డిండి మండలంలోని టీ. గౌరారం కాలనీలో ఉన్న శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ పునర్నిర్మాణానికి కాలనీ ప్రజలు, పెద్దలు శ్రీకారం చుట్టనున్నారు. శనివారం నిర్వహించిన ఆలయ నిర్మాణ సమావేశంలో వ్యయం, నిధుల సేకరణపై సుదీర్ఘంగా చర్చించారు. గ్రామంలో ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ఆలయ నిర్మాణం కోసం రూ. 3వేల విరాళంగా ఇవ్వాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ విరాళాలను ఏప్రిల్ 01 నుండి జూన్ 01వ తేది లోపు అందజేయాలని నిర్ణయించారు. ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ పిల్లి లక్ష్మమ్మ, మాజీ సర్పంచ్ పిల్లి బాలయ్య, వార్డు సభ్యులు ఆంజనేయులు, వెంకటయ్య, మహేష్, గ్రామ పెద్దలు సత్తయ్య, వెంకటేశులు, శంకర్, యువకులు పాల్గొన్నారు.





## విజిలెన్స్ కమిటీ సభ్యురాలు అనిత సురేష్‌కు ఘన సన్మానం

**ప్రజాపక్షం/దేవరకొండ;** నల్గొండ జిల్లా విజిలెన్స్ కమిటి సభ్యురాలిగా ఇటీవల నియమితులైన యేకుల అనిత సురేష్‌ను శనివారం దేవరకొండ పట్టణంలో జాతీయ బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. బిసి వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కార్య దర్శి డా. చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్ నేతృత్వంలో ఈ కార్య క్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో బహుజన మేధావి డా. యేకుల రాజారావు, పున్న వెంకటేశ్వర్లు, బిక్షమయ్య, పెంటోజి, శ్రీనివాస్‌చారి, రేణుగౌడ్, పెద్ది రాజు, శారద పాల్గొన్నారు.

## దైవ చింతనతోనే ప్రశాంతత



**ప్రజాపక్షం/డిండి;** దైవ చింతనతోనే మానసిక ప్రశాం తత లభిస్తుందని బిఆర్ఎస్ దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్‌నాయక్ అన్నారు. శనివారం డిండి మండలం దేవత్‌పల్లి తండాలో బంజారాల ఆరా ధ్య దైవం శ్రీశ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ పూజారి కిషన్ బావోజీ, మాజీ ఎంపిటిసి సర్య, ప్రకాష్, లచ్చిరాం పాల్గొన్నారు.

## ఎక్సైజ్ అధికారులమంటూ నకిలీ దాడులు



**ప్రజాపక్షం/కోదాడ రూరల్ ః** మండల పరిధిలో ఎక్సైజ్ అధికారులమని చెబుతూ ఆ ముసుగులో నకిలీ దాడులు చేసిన ఘటన శనివారం వెలుగులోకి రావడం చర్చనీ యాంశమైంది. రాంపురం క్రాస్ రోడ్డులోని ఒక వైన్‌షా పుకు చెందిన కొంతమంది సిబ్బంది ఎక్సైజ్ అధికారుల మని చెప్పుకొని బెల్ట్‌షాపులపై నకిలీదాడులు నిర్వహించి వారిని భయభ్రాంతులకు గురిచేశారు. బెల్ట్‌షాపు యజ మానులను భయపెట్టి ఫలానా వైన్‌షాపు నుంచే మద్యం కొనాలని ఒత్తిడి తేవడంతోపాటు వారి నుండి మద్యాన్ని, డబ్బును అక్రమంగా వసూలు చేశారు. ఈ విషయం తెలుసుకున్న మేళ్లచెరువు ఎక్సైజ్ అధికారులు రంగం లోకి దిగి వారిని పట్టుకోగా వారు వైన్‌షాప్ సిబ్బందేనని నిర్ధారణ అయ్యింది. దీంతో వారిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## అండగా స్నేహితులు

**ప్రజాపక్షం/నకిరేకల్ :** మండల పరిధిలోని అడ్లూరు గ్రామానికి చెందిన పచ్చిపాల రామకృష్ణ ఇటీవల అనా రోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. శనివారం ఆయన దశదినకర్మ సందర్భంగా,జడ్‌పిహెచ్‌ఎస్ అడ్లూరు 2007 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన స్నేహి తులు కలిసి సేకరించిన రూ.15,000ను రామకృష్ణ తల్లి దండ్రులకు అందజేశారు. సహాయం అందిస్తూ అండగా నిలుస్తామని తెలిపారు.

# బిఆర్ఎస్ సర్పంచులపై వివక్ష



**ప్రజాపక్షం/నకిరేకల్ :** నకిరేకల్ నియోజకవర్గంలో బిఆర్ఎస్ సర్పంచులున్న గ్రామాల్లో అభివృద్ధి పనులు అడ్డుకుంటూ ఎమ్మెల్యే వేముల వీరేశం వివక్ష చూపుతున్నారని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆరోపించారు. పట్టణంలోని సువర్ణ గార్డెన్ ఫంక్షన్ హాల్లో శనివారం నిర్వహించిన విలేక రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళా సంఘ భవనాలు, సీసీ రోడ్లు, మురుగుకాల్వలు వంటి పనులు చేపట్టొద్దని పంచాయతీ కార్యద ర్శులు, ఎంపీడీఓలు, పంచాయతీరాజ్ ఏఈలపై ఒత్తిడి తీసుకొస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ సర్పంచుల గ్రామాల్లో పనులు చేస్తే బిల్లులు చేయొ ద్దని సూచిస్తున్నారని అన్నారు. 27 నెలలు గడిచినా సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన అభివృద్ధి నిధులు నకి రేకల్‌కు ఒక్క రూపాయి కూడా రాలేదని పేర్కొ న్నారు. ఈ సమావేశంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల ప్రదీప్ రెడ్డి,మాజీ మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్,బిఆర్ఎస్ మండల అధ్యక్షులు ప్రగడపు నవీన్‌రావు,మారం వెంకట్ రెడ్డి,ఉపాధ్య క్షుడు గుండగోని జంగయ్య,కడపర్తి సర్పంచి గౌర్ల వీరయ్య,కొర్లపహాడ్ సర్పంచి సైదిరెడ్డి, మాజీ ఎంపీ టీసీ రాచకొండ వెంకట్,నాయకులు పెండెం సదా నందం,రావిరాల మల్లయ్య,దైద పరమేశం, లింగా రెడ్డి, చింతా శివమూర్తి పాల్గొన్నారు.

# మాదిగ దండోరా ఉద్యమాన్ని బలోపేతం చేయాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ ః** మాదిగ దండోరా ఉద్యమాన్ని బలోపేతం చేయాలని మహాజన సోష లిస్టు పార్టీ జిల్లా అధ్యక్షులు యాతాకుల రాజన్న మాదిగ, జిల్లా ఎంఆర్‌పిఎస్ కన్వీనర్ ఏపూరి రాజు మాదిగ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ భవనంలో ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి నూతన జిల్లా కమిటిల పునర్నిమాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంఆర్‌పిఎస్ అధినేత, దండోరా దళ పతి మందకృష్ణ మాదిగ నాయకత్వంలో 32 సంవ త్సరాలుగా హక్కుల సాధన కోసం అలుపెరుగని పోరాటం చేయడం జరుగుతుందన్నారు. సూర్యా పేట నియోజక వర్గ పరిధిలోని 4 మండలాల్లో కమి టిలు వేసేందుకు నిర్ణయించామని చెప్పారు. ఈనెల 30న ఆత్మకూర్(ఎస్) మండల సదస్సు, 31వ తేదీన చివ్వెంల, ఏప్రిల్ 2న సూర్యాపేట పట్టణ, రూరల్, 3న పెన్‌పహాడ్ నందు సదస్సులు నిర్వహించి నూతన కమిటిలు వేయనున్నట్లు తెలిపారు. ఈ సద స్సులకు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు ఎర్ర వీరస్వామి మాదిగ, ములకలపల్లి రవి మాదిగ, దైద శ్రీనివాస్ మాదిగ, మేడి కృష్ణమాదిగ, బొజ్జ వెంకన్న మాదిగ, దాసరి వెంకన్న మాదిగ, చెరుకుపల్లి సతీష్ మాదిగ తదిత రులు పాల్గొన్నారు.

# లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం




**ప్రజాపక్షం/నకిరేకల్ :**లోక్ అదాలత్‌ల ద్వారా కక్షి దారులకు సత్వర న్యాయం అందుతుందని న్యాయ సేవా కమిటీ చైర్మన్ కుమారి మంజుల సూర్యావర్, జూనియర్ సివిల్ జడ్జి షేక్ ఆరిఫ్ తెలిపారు.శని వారం మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహిం చారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఇరుప క్షాల సమ్మతితో రాజీమార్గంలో కేసులు పరిష్కరిం చడం వల్ల సమయం, ఖర్చు రెండూ ఆదా అవుతా యని పేర్కొన్నారు. లోక్ అదాలత్‌లో ఇచ్చే తీర్పు లకు సాధారణంగా అప్పీల్‌కు అవకాశం ఉండదని వివరించారు. జాతీయ లోక్ అదాలత్‌లో క్రిమినల్, సివిల్, మోటార్ వాహనాలు (డ్రంక్ అండ్ డ్రైవ్)కు సంబంధించిన మొత్తం 934 కేసులు పరిష్కరించబ డ్డాయి. వీటిలో విధించిన జరిమానాల రూపంలో రూ.83,190 వసూలు చేసినట్లు అధికారులు తెలి పారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్య క్షులు పూజార్ల శంభయ్య,లోక్ అదాలత్ సభ్యులు సూదిని శ్రీనివాస్ రెడ్డి,కొండ యాదగిరి,జాల కొమ రయ్య,అక్కినపల్లి వీరస్వామి,న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, కక్షిదారులు పాల్గొన్నారు.

## వీధి కుక్కల దాడిలో గాయపడిన బాలుడిని పరామర్శ

**ప్రజాపక్షం/భువనగిరి :** భువనగిరి పట్టణంలో గురు వారం వీధి కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడిన మూ డేళ్ల బాలుడు ప్రియాన్ష్‌ను భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి శనివారం పరామర్శించారు. హైదరాబాద్‌లోని ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలుడిని, కుటుంబ సభ్యులను కలిసి ఆయన ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో భువనగిరి మాజీ మున్సిపల్ చైర్మన్ ఎనబోయిన ఆంజనేయులు, బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు ఏవి కిరణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి రచ్చ శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు.



## అంగరంగ వైభవంగా రథోత్సవం

**ప్రజాపక్షం/నాంపల్లి:** మండలంలోని పస్నూర్, కేతెపల్లి, గట్ల మల్లేపల్లి గ్రామా లలో శ్రీ సీతారాముల వారి రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో పండుగ వాతావ రణం నెలకొంది.మంగళ వాయిద్యాల నడుమ భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొని, వేద పండితులు రామనామ స్మరణ చేస్తుండగా రథాన్ని భక్తులు ఉత్సాహంగా లాగారు. అనంతరం భక్తులు స్వామివారికి కట్న కానుకలు సమర్పించి తమ భక్తిని చాటుకు న్నారు.ఈ కార్యక్రమంలో కేతెపల్లి గ్రామ సర్పంచ్ పెరికెటి రమేష్,ఉప సర్పంచ్ పల్లేటి దీపిక వెంకటేష్,వార్డు సభ్యులు, పస్నూర్ ఆలయ కమిటీ చైర్మన్ రేగోజు నర సింహాచారి,ఆలయ కమిటీ సభ్యులు, దండిగా పెద్ద సత్తయ్య పాల్గొన్నారు.



## భక్తిశ్రద్ధలతో హోమ పూజలు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలోని ఎన్‌ఎస్పీ క్యాంప్‌లో నిర్వహిస్తున్న శ్రీమహాలక్ష్మి యాగ ఉత్సవాల్లో భాగంగా శనివారం శ్రీ భూవరాహ హోమ పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శ్రీభా ష్యకార సిద్ధాంతి పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీరామచంద్ర రామానుజజీయర్ స్వామి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాలకు భక్తులకు వేలాదిగా తరలివచ్చారు. ఈ సందర్భంగా రామానుజజీ యర్ స్వామి మాట్లాడుతూ ఇష్టి యాగశాలలో శ్రీభూవరహ హోమంతో భూ సమస్యలకు పరిష్కారం లభించడంతోపాటు భూ సంపద పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో రైస్ మిల్లర్స్ కర్నాటి రమేష్, బండారు కుశలయ్య, గందె రాము, గౌరు శ్రీనివాస్, గూడూరు శ్రీనివాసరావు, చిలకల రవికుమార్, గుడిపాటి నాగేం దర్, జీవిడి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## బార్ అసోసియేషన్ విజేతలకు సన్మానం



**ప్రజాపక్షం/రామన్నపేట :** రామన్నపేట పట్టణంలో బార్ అసోసి యేషన్ అధ్యక్షుడుగా ఎంఎ మజీద్ ఘన విజయం సాధించారు. ఉపాధ్యక్షుడుగా బాలరాజు, జనరల్ సెక్రటరీగా యాదాసు యాదయ్య ఎన్నికైనందున రామన్నపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ జమీరుద్దీన్ ఆధ్వర్యంలో శాలువాలతో సత్కరించి పూలదం డలు వేసి సన్మానం చెశారు. ఈ కార్యక్రమంలో రామన్నపేట సర్పంచ్ గరిక సత్యనారాయణ, ఉప సర్పంచ్ మోటె రమేష్, మాజీ సర్పంచ్ గోదాసు పృథ్వీరాజ్, డీసీసీబీ డైరెక్టర్ జెల్ల వెంకటేశం, మాజీ ఎంపీటీసీలు సాల్వేరు అశోక్, వనం చంద్రశేఖర్, గౌరవ వార్డు సభ్యులు అబ్దుల్ వాహిద్ మహమ్మద్ (అంజాద్), కొమ్ము శేఖర్, కొమ్ము రామస్వామి, సుదర్శన్, కందుల సాయి, గొరిగే శేఖర్, రామన్నపేట సోషల్ మీడియా కో ఆర్డినేటర్ ఎండీ నిజాము ద్దీన్, సీనియర్ నాయకులు ఎండీ నాసర్ పాల్గొన్నారు.

## ముగిసిన వార్డు సభ్యులు శిక్షణ



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** నూతనంగా ఎన్నికైన గ్రామపంచా యతీ వార్డు సభ్యుల శిక్షణ కార్యక్రమంలో శనివారం ముగిసింది. మండలంలోని 46 గ్రామపంచాయతీలకు సంబంధించి 394 మంది వార్డు సభ్యులకు టీఓటీ సతీస్, మురళీమోహన్, దుర్గయ్యలు పంచాయతీరాజ్‌చట్టం, వార్డు సభ్యుల బాధ్యతలపై అవగాహన కల్పించారు. 2018పంచాయతీరాజ్ చట్టం, గ్రామపంచాయతీ విధులు, బాధ్యతలు, సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యుల విధు లు, బాధ్యతలు, గ్రామాల్లో పారిశుద్ధ్యం, వనమహోత్సవం, వీది దీపాల నిర్వహణ, పన్నుల వసూళ్లు, గ్రామపంచాయతీ పనుల నిర్వహణ, అభివృద్ధి ప్రణాళిక వంటి వాటిపై అవగాహన కల్పిం చారు. కార్యక్రమంలో ఎంపీడీవో శేషగిరిశర్మ, డివిజనల్ పంచా యతీ అధికారి రాఘవరావు, ఎంపీవో రమేష్, సూపరింటెండెంట్ బాషా, సిబ్బంది మణికంఠ, పృద్వీతేజ పాల్గొన్నారు.

## చలివేంద్రం ప్రారంభం




**ప్రజాపక్షం/మోతె ః** చలి వేంద్రాన్ని మండల కేంద్రంలో గ్రామ సర్పంచ్ దోసపాటి అనురాధ ప్రా రంభం చేసిన అనంతరం ఆమె మాట్లాడారు.ప్రతి ఒక్కరు ఈ చలి వేంద్రంను ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు సభ్యులు వీరబాబు, నవీన్, కార్యదర్శి రవీందర్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# రాత్రి వేళల్లో ఇసుక ట్రాక్టర్ల మోత...

ప్రజలకు కంటి కునుకు లేకుండా
రాత్రంతా దళారుల ఇసుక దందా...
అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే
కఠిన చర్యలు...ఎస్ఐ బాలకృష్ణ



**ప్రజాపక్షం/డిండి;** నల్గొండ జిల్లా డిండి మండలంలో ఇసుక అక్రమ రవాణా ఏదేచ్ఛగా సాగుతుంది. చీకటైతే చాలు అక్రమార్కులు ఇసుక రూపంలో నిద్ర లేచి రాత్రంతా ట్రాక్టర్లతో ఇసుకను తరలించి సొమ్ము చేసు కుంటూ ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారు. ప్రభుత్వ నిబంధనలతో మాకేం పని మా పని మేం చేసుకుంటామని రాత్రి వేళల్లో ఇసుక తరలించే వారంతా తమ ట్రాక్టర్లతో ఇసుకను మండలంలోని ఆయా గ్రామాలకు తరలిస్తున్నారు. ట్రాక్టర్ యజమా నులే ముందస్తు సమాచారం కోసం రోడ్లపై కాపు కాస్తూ ఇసుకను చాకచక్యంగా తరలిస్తున్నారు. మండ లంలోని గోనబోయినపల్లి, ప్రతాప్‌నగర్ గ్రామాల వారు దుందుభి వాగు నుండి, కందుకూరు, నెమలి పూర్ కందుకూరు వాగు నుండి, వావిలికోల్ గ్రామాల వారు వావిలికోల్ వాగు నుండి ఇసుకను రాత్రి వేళల్లో అక్రమంగా తరలిస్తూ ప్రభుత్వ ఖజానాకు గండి కొడు తున్నారని అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు వాపోతున్నారు.

**అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల సీజ్**
ఎలాంటి అనుమతులు లేకుండా వావిలికోల్ గ్రామం నుండి అక్రమంగా 3 ఇసుక ట్రాక్టర్‌లతో ఇసుకను తర లిస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు శనివారం డిండి పోలీసులు రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకోగా, మరో ట్రాక్టర్ గల వ్యక్తి పారిపోయినట్లు డిండి ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు. ఈ మూడు ట్రాక్టర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

**అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు....ఎస్ఐ**
ఎవరైనా ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక అక్రమంగా రవాణాచేస్తే కఠిన చర్యలు తీసు కుంటామని డిండి ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు. మండ లంలో ఎవరు ఎప్పుడైనా అనుమతులు లేకుండా అక్ర మంగా ఇసుక తరలిస్తే ప్రజలు పోలీసులకు సమా చారం ఇవ్వాలని సూచించారు.



## సదరం క్యాంపుల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్

**ప్రజాపక్షం/యాదాద్రి :** సదరం క్యాంపుల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సెర్ఫ్ సిఈఓ దివ్య శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో సదరం పెండింగ్ కేసులు లేకుండా త్వరి తగతిన పూర్తిచేయాలని, అలాగే యుడిఐడి దరఖాస్తులపై వేగవం తంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) భాస్కర్ రావు మాట్లాడుతూ జిల్లాలో సదరం సేవలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా పెండింగ్ కేసులను త్వరితగతిన క్లియర్ చేయాలన్నారు. యుడిఐడి దరఖాస్తులు వచ్చిన వెంటనే సదరంలో నమోదు చేయాలన్నారు. కొత్త దరఖాస్తులపై సమయానికి వికలాంగత సర్టిఫికెట్లు జారీ చేయాలని, రెన్యువల్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని, ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కారం కోసం ప్రత్యేక రిజిస్టర్ నిర్వహించాలన్నారు. యుడిఐడి కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేసి, సంబంధిత డేటాను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో డిఆర్‌డిఒ నాగిరెడ్డి, డా.కిరణ్ ఆర్‌డిఒ, (ప్రభుత్వ ఆసుపత్రి భువనగిరి), సుమన్ (ఏపిఓ పెన్షన్), సదరం సిబ్బంది పాల్గొన్నారు.



## ప్రభుత్వ విప్ వీరేశంకు ఎంపి చామల శుభాకాంక్షలు

**ప్రజాపక్షం/నకిరేకల్:** తెలంగాణ ప్రభుత్వ విప్‌గా నియమితులైన నకిరేకల్ శాసనసభ్యుడు వేముల వీరేశంను భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అసెంబ్లీ ప్రాంగణంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈసందర్భంగా ఆయనకు శాలువాతో సత్కారం చేసి శుభాకాంక్షలు తెలిపారు. రాబోయే రోజుల్లో ప్రజా సమస్యల పరిష్కారంలో మరింత చురుకుగా పనిచేస్తూ ప్రజలకు సేవ చేయాలని ఎంపీ ఆకాంక్షించారు.

## యమపురికి పిలుపునిస్తున్న పూరెనగుట్ట మూలమలుపు

హెచ్చరిక బోర్డులు,రిఫ్లక్టర్లు,
స్పీడ్ బ్రేకర్లు లేక నిత్యం ప్రమాదాలు
వెంటనే చర్యలు తీసుకోవాలంటూ
ప్రజల ఆవేదన



**ప్రజాపక్షం/మర్రిగూడ:**మండలంలో వరుసగా జరుగు తున్న రోడ్డు ప్రమాదాలు ప్రజల్లో తీవ్ర భయాందోళన లకు దారితీస్తున్నాయి.ముఖ్యంగా రామరెడ్డిపల్లిఎరుగం డ్లపల్లి శివారులో ఉన్న పూరెనగుట్ట మూలమలుపు ప్రమాదాలకు కేంద్రబిందువుగా మారింది.ఈమూలమ లుపు యమపురికి పిలుపునిస్తున్నదనే స్థాయిలో పరిస్థి తులు విషమంగా ఉన్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.గతంలో ఈ ప్రాంతంలో జరిగిన ప్రమాదాల్లో అనేక మంది ప్రాణాలు కోల్పోగా, పలు వురు తీవ్రంగా గాయపడి ఆసుపత్రుల పాల య్యారు.అయినప్పటికీ,ప్రమాదాలను తగ్గించే చర్యలు మాత్రం తీసుకోకపోవడం పట్ల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.ఈసమస్యపై పలుమార్లు ఆర్అండ్‌బి అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ,వారు నిర్ల క్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తు న్నారు.ప్రమాదకరంగా ఉన్న ఈమూలమలుపులో హెచ్చరిక బోర్డులు, రిఫ్లక్టర్లు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ప్రజలు సూచిస్తు న్నారు.ఇప్పటికైనా ఆర్అండ్‌బి అధికారులు స్పందించి, తక్షణమే భద్రతా చర్యలు చేపట్టి, భవిష్యత్తులో జరిగే ప్రమాదాలను నివారించాలని మర్రిగూడ మండల ప్రజలు గట్టిగా కోరుతున్నారు.

## అంగరంగ వైభవంగా రథోత్సవం



**ప్రజాపక్షం/నాంపల్లి:** మండలంలోని పస్నూర్, కేతెపల్లి, గట్ల మల్లేపల్లి గ్రామాలలో శ్రీ సీతారాముల వారి రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది.మంగళ వాయిద్యాల నడుమ భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొని, వేద పండితులు రామనామ స్మరణ చేస్తుండగా రథాన్ని భక్తులు ఉత్సాహంగా లాగారు. అనంతరం భక్తులు స్వామివారికి కట్న కానుకలు సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు.ఈ కార్యక్రమంలో కేతెపల్లి గ్రామ సర్పంచ్ పెరికెటి రమేష్,ఉప సర్పంచ్ పల్లేటి దీపిక వెంకటేష్,వార్డు సభ్యులు, పస్నూర్ ఆలయ కమిటీ చైర్మన్ రేగోజు నరసింహాచారి,ఆలయ కమిటీ సభ్యులు,దండిగా పెద్ద సత్తయ్య, వల్లపు లక్ష్మమ్మ,బుడిగ గిరి,పంబాల రామస్వామి,గ్రామ సర్పంచ్ గోవర్ధన్,ఉప సర్పంచ్ దండిగా ఆంజనేయులు,వీరమల్ల సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరామంజనేయ యుద్ధం నాటక ప్రదర్శన

**ప్రజాపక్షం/పాలకవీడు:** శ్రీరామనవమి పండుగ సందర్భంగా మండల పరిధిలోని జాన్‌పహాడ్ గ్రామంలో తెలంగాణ రాష్ట్ర చలనచిత్ర అభివృద్ధి సంస్థ వారి సౌజన్యంతో శ్రీ వెంకటేశ్వర కళా నాట్యమండలి వారిచే సీనియర్ కళాకారులతో పాలకవీడు మండల పౌరాణిక కళాకారుల సంఘం అధ్యక్షులు షేక్ ముస్తాఫా దర్శకత్వంలో శ్రీ రామాంజనేయ యుద్ధం పూర్తి నాటకం ప్రద ర్శించారు. ఈ నాటికను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు యన్‌వి సుబ్బారావు ప్రారంభించారు. ముఖ్యంగా ఈ నాటకంలో శ్రీరాముడిగా నటిం చిన జాన్‌పహాడ్ గ్రామానికి చెందిన ముస్తాఫా, ఆంజనేయుడు పాత్ర పోషించిన ఎల్లంపల్లి గ్రామా నికి చెందిన కొడవతి రామకోటయ్యలు పలువురిని ఆకట్టుకున్నారు. పాత్రదారులు తాయ సైదులు, శ్రీనివాస్‌చౌదరి, రూపావత్ వెంకట్రావ్, బొమ్మ కంటి నాగరాజు పాల్గొన్నారు.



## భూగర్భ జలాలను కాపాడుకోవాలి

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా అవగా హన కార్యక్రమం నిర్వహణ సీడ్ స్వచ్ఛంద సంస్థ నిర్వహణలో, జిల్లా భూగర్భ జల శాఖ యాదాద్రి భువనగిరి సహకారంతో నీరు ,లింగ సమానత్వం థీమ్తో 36వ ప్రపంచ జల దినో త్సవం పురస్కరించుకొని శనివారం రైతు వేది కలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులగా ఆర్‌డిఓ శేఖర్ రెడ్డి మాట్లాడుతూ విఘవిషరిస్తున్నా పట్టనికరణ, ఎక్కువ నీటీ అవ సరాలు ఉండటం వర్షపు నీరు భూగర్భ జలాలు ఇంకించకపోవడం అధికముగా నీటి విని యోగం వల్ల నీటి కొరత సమస్య మరింత తీవ్ర మవుతోందని పేర్కొన్నారు. మండల రెవిన్యూ అధికారి శ్రీనివాస్ రెడ్డి, వ్యవసాయ అధికారి వెం కటేశ్వర్లు, జిల్లా ఫిషరీస్ అధికారి పాల్గొన్నారు.



## డాక్టర్లపై దాడికి ఐఎంఎ తీవ్ర ఖండన

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** నిర్మల్ పట్టణంలోని డాక్టర్స్ కాలనీలో ఉన్న ఎస్‌వీఆర్ ఆసుపత్రిలో డాక్టర్ మరియు సిబ్బందిపై జరిగిన దాడి,ధ్వంస ఘటనను ఐఎంఏ నీలగిరి బ్రాంచ్ నల్లగొండ తీవ్రంగా ఖండించింది.ఈ ఘటనకు నిరసనగా నీలగిరి బ్రాంచ్ ఆధ్వర్యంలో డాక్టర్లు నల్ల బ్యాడ్జీలు ధరించి తమ నిరసనను వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర మాజీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ పుల్లారావు,నీలగిరి బ్రాంచ్ అధ్యక్షుడు డాక్టర్ రమేష్, కార్యదర్శి డాక్టర్ విజయ్ కుమార్ మాట్లాడుతూ డాక్టర్లు ఆసుపత్రులను సేఫ్టీ జోన్స్‌గా పరిగణించి గట్టి భద్రత కల్పిస్తేనే అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రోగులను రక్షించే అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు.ఈ నిరసన కార్యక్రమంలో డాక్టర్ జార్జి ప్రవీణ్, డాక్టర్ అనిత రాణి, డాక్టర్ విశ్వజ్యోతి,డాక్టర్ రామచంద్ర, డాక్టర్ దేవాదినం, డాక్టర్ రాజిరెడ్డి శ్రీనివాస్ రావు,డాక్టర్ డీఎస్సీ,డాక్టర్ అరుంధతి పాల్గొన్నారు.



## సీనియారిటీ ప్రకారం జనగణన విధులు ఇవ్వాలని వినతి

**ప్రజాపక్షం/నకిరేకల్ :** మండలంలోని గ్రామీణ,పట్టణ ప్రాంతాల్లో నిర్వహించనున్న జనగణన2026 విధులను ఉపాధ్యాయులకు సీని యారిటీ ప్రకారం కేటాయించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపా ధ్యాయ ఫడరేషన్ నకిరేకల్ మండల కమిటీ విజ్ఞప్తి చేసింది.సూపర్వై జర్లు,ఎన్యూమరేటర్ల నియామకంలో పారదర్శకత పాటిస్తూ, స్థానిక ఉపాధ్యాయులకు అదే ప్రాంతాల్లో విధులు అప్పగించేలా చూడా లని తహసీల్దార్,మున్సిపల్ కమిషనర్ నకిరేకల్ గార్లకు ప్రతినిధులు వినతిపత్రం సమర్పించారు.ఈకార్యక్రమంలో జిల్లా కార్యదర్శి యాట మధుసూదన్ రెడ్డి,జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు టి.నర్సింహ మూర్తి,మండల కమిటీ అధ్యక్షుడు కె.శ్రీనివాస్,కార్యదర్శి ఈ.హరి కృష్ణ,నాయకులు బి.శ్రీనివాసులు,బొజ్జ వేణుగోపాల్, బి. రామకృష్ణ రెడ్డి,ఆర్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

